క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం అందజేత



పెడన: భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శనివారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఇంటర్ సాంకేతిక విద్య విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణ యూనిఫాం అందజేశారు. తొలుత పాఠశాల స్థల దాత భట్ట జ్ఞానకోటయ్య విగ్రహానికి హెచ్‌ఎం అశోక్‌కుమార్‌తో కలిసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



పెడన: పట్టణంలోని శ్యామలనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి అలివేలు మంగా సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి 21వ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు, దీపారాధన సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా విశిష్ట లడ్డు ప్రసాద నివేదన చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన అవసరం



పెడన: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓటుపై పట్టభద్రులు అవగాహన కలిగి ఉండాలని ఇంఛార్జి తహసీల్దారు కె. అనిల్ కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. పెడన మండలంలో భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు తనిఖీ

పెడన: పట్టణంలోని మచిలీపట్నం రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకును శనివారం ఇంఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్, పీడీఎస్ డీటీ కేవీ నాగమల్లేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ కొలతలు ఏ విధంగా ఉన్నాయి, నాణ్యత ప్రమాణాలు, మీటరు రీడింగ్‌లను పరిశీలించారు. అనంతరం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బంకు సిబ్బందితో శుభ్రం చేయించి నిత్యం క్లీన్‌గా ఉంచాలని స్పష్టం చేశారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు



మచిలీపట్నంటౌన్: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన ఉత్సవంలో భాగంగా శనివారం నగరంలోని చిట్టి పిల్లారయ్య ఆలయ ప్రాంగణంలోని శ్రుతి సౌరభవం శ్రీ రామరత్న కళావేదికపై పలువురు గాయకులు ఆలపించిన అన్నమాచార్యుని కీర్తనలు శ్రోతలను అలరించాయి. దాదాపు 220 మందికి పైగా గురుశిష్యులు పాల్గొని కీర్తనలను లయబద్ధంగా ఆలపించారు. అన్నమాచార్య సంగీత సభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు గాయకులు హాజరయ్యారు. సప్తగిరి సంకీర్తన మాల బృందగానం, సంకీర్తనార్చన ఆకట్టుకున్నాయి. నృత్యశ్రీ, నాట్య మయూరి మేఘన శ్రీలక్ష్మి చేసిన అన్నమయ్య కీర్తనల నాట్యాభినయం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఘంటసాల: అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యాన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలతో కూడిన 2025 క్యాలెండర్‌ను ఘంటసాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ను శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, జి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు ఆవిష్కరించారు. జామియా మస్జిద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ బాషా, ఇమామ్ అబ్దుల్ గఫ్ఫార్, వైస్ ప్రెసిడెంట్ మెహబూబ్ సుభాని పాల్గొన్నారు.

పచ్చచొక్కాలకే పనులివ్వాలి.!



పైపులైను కోసం తీసి వదిలేసిన గోతులు



తాగునీటి కోసం సిద్ధంగా ఉన్న పైపులు

- కాంట్రాక్టర్ జనసేన అయినా కుదరదంటూ హుకుం
- పైపులైను పనులను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

కృత్తివెన్ను: అధికారం మాది.. మేము చెప్పిన వారికే అన్ని పనులూ ఇవ్వాలి అది జనసేన అయినా సరే కుదరదంటూ కృత్తివెన్ను మండలం ఇంతేరులో టీడీపీకి చెందిన కొందరు దౌర్జన్యం చేస్తున్నారంటూ సర్పంచ్ భర్త లబోదిబో అంటున్నారు. తమ పంచాయతీలోని పార్వతీపురం అనే గ్రామానికి తాగునీటి అవసరాలు కోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో 520 మీటర్లు మేర రూ. 2.72 లక్షలతో పైపులైను పనులకు తీర్మానం చేశారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తోంది. పనులు చేద్దామని గ్రామానికి వచ్చిన కాంట్రాక్టర్‌ను టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ పనులు చేయాలంటే మేమే చేయాలి లేదా మేము చెప్పిన వారే చేయాలి అంటూ అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే రాజకీయ పార్టీలకతీతంగా పని చేయాల్సిన అధికారులే టీడీపీ వారికే పనులు కాంట్రాక్ట్ ఇవ్వాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్‌లోని ఓ ఉన్నతాధికారి మీరు ఇచ్చిన తీర్మానం రద్దు చేసి నేను చెప్పిన టీడీపీ నాయకుడికే కాంట్రాక్ట్ ఇవ్వాలని బెదిరించినట్లు సర్పంచ్ భర్త వాపోతున్నారు.

జనసేన అయినా డోంట్‌కేర్

పైపులైను కాంట్రాక్ట్ పనులు వర్క్ ఆర్డర్ తీసుకున్న వ్యక్తి జనసేన పార్టీకి చెందిన వారు. అయినా సరే ఇక్కడ జనసేన వ్యక్తులు పనులు చేయడానికి కుదరదంటూ పనులను అడ్డుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఎప్పుడో మంజూరైన పనులకు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ పనులు నిలిపేయాలంటూ అధికారులు కొత్తరాగం అందుకున్నారు. పార్వతీపురం గ్రామం సముద్రానికి చేరువుగా ఉంటుంది. రానున్నది వేసవికాలం. కాబట్టి పార్టీల పేరుతో రాజకీయం చేయకుండా తాగునీరందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దారుణంగా ప్రవర్తిస్తున్నారు



గ్రామంలో టీడీపీ వారు పంచాయతీ నిధులతో జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఎప్పుడో మంజూరైన పనులకు ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారు. దీనికి అధికారులు సైతం వంతపాడుతున్నారు. ఓ అధికారి నేను చెప్పిన వారికి కాంట్రాక్ట్ ఇవ్వకపోతే నిన్ను జైలుకు పంపుతానని బెదిరించాడు.

– పెదశింగు సామోరు, ఇంతేరు

అభివృద్ధిని అడ్డుకోవడం అన్యాయం



గ్రామంలో అభివృద్ధి పనులను అడ్డుకోవడం న్యాయమా.? మీ చేతిలో అధికారం ఉంటే నిధులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి సహకరించాలి. పైపులైను పనులను కేవలం రాజకీయ కోణంలో నిలిపివేయడం ఎంత వరకు సమంజసం. పార్టీలకతీతంగా రాజకీయ పెద్దలు ఆలోచించాలి.

– పెదశింగు మోకమ్మ, సర్పంచ్, ఇంతేరు

విద్యార్థులకు బహుమతులు అందజేత

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం తన చాంబర్‌లో కలెక్టర్ డీకే బాలాజీ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, బంధుమిత్రులతో హెల్మెట్, సీటు బెల్టు ధరించేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి బీఎస్ఎస్ నాయక్, ఎంవీఐలు ఎండీ సిద్ధిఖ్, నారాయణ స్వామి, డీ సోనీప్రియ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన బంటుమిల్లికి చెందిన విద్యార్థులకు కలెక్టర్ డీకే బాలాజీ శనివారం బహుమతులు అందజేశారు. కొమ్మారెడ్డి పాఠశాలకు చెందిన ఏ. హనీశ్రీ, టీ. లాస్య, యన్. గీతియాప్రియలు ప్రథమ స్థానం, వి. భావన, సిహెచ్. లిఖిత, కె. మౌక్తికలు ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. అలాగే సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన పి. ప్రవల్లిక, ఎ. ఖతీజా, వై. కుసుమశ్రీలు మొదటి స్థానం, కె. ప్రస్తుతి, పి. రుతిక, పి. ప్రసన్నలు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలను పాఠశాల డైరెక్టర్లు కిషోర్, సాబూజాన్, హెచ్‌ఎంలు ఎస్. శ్రీనివాసరావు, ఝాన్సీసాబూలు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

కోనేరుసెంటర్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేర్కొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



విజేతలకు బహుమతులను అందజేసిన జిల్లా ఎస్పీ గంగాధరరావు

రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు శనివారం ఆయన బహుమతులను అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయండి

మోపిదేవి: మోపిదేవిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ పి.లావణ్యను పలువురు రైతులు కోరారు. మండలంలోని మోపిదేవి వార్పు వద్ద ధరలు లేక కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో క్యాబేజీ పంటను రోటోవేటర్‌తో దున్నేసిన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ, ఉద్యానశాఖ అధికారులు శనివారం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతు బజారు ఏర్పాటు చేస్తే తాము పండించిన పంటను మార్కెట్‌లోనే అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు. అలాగే వినియోగదారులకు కూడా తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందుతాయని తెలిపారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి ఎన్నికల కోడ్ అనంతరం మోపిదేవిలో మినీ రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ జిల్లా ఏడీ నిత్యానందం, మార్కెట్ యార్డు, ఉద్యానశాఖ అధికారి ఎస్ రమేష్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఐడీ నంబర్ తప్పనిసరి

రావివారిపాలెం(మోపిదేవి): రైతులు పొలానికి ఐడీ నెంబర్ పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని రావివారిపాలెంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ నెంబర్ ఉంటేనే రాబోయే రోజుల్లో పీఎం కిసాన్, అన్నదాన సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వంటివి పొందుతారని వివరించారు. పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, మొబైల్ తీసుకుని వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

చౌడేశ్వరి దేవి ప్రసాదం పంపిణీ

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాలు ముగిసిన పిమ్మట అమ్మవారి ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. దేవాంగ సామాజిక వర్గం కులదైవమైన అమ్మవారి ప్రసాదాన్ని నిష్ఠతో పంపిణీ చేశారు. ఉటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ భీ – పడాయి భీ శిక్షణ

ఘంటసాల: ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న పోషణ్ భీ – పఢాయి భీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మొవ్వ ప్రాజెక్టు సీడీపీవో డి.సుధారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే గర్భవతులు, బాలింతలకు చిన్నారుల ఆరోగ్యం, ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మూడు రోజుల జరిగిన శిక్షణ ద్వారా అంగన్‌వాడీల్లో నూతన ఉత్సాహంతో పని చేసి చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ తరగతులపై అంగన్‌వాడీ కార్యకర్తలు రచించి స్వరపరిచిన గీతాలు ఆలపించి వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: పోషణ్ భీ పడాయి శిక్షణ శనివారం ముగిసింది. ఈ శిక్షణలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి గర్భిణీలు, బాలింతలు, పిల్లల పట్ల శ్రద్ధ కనపరచాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామలాగౌరీ, రాఘవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘంటసాలలో అంగన్వాడీ కార్యకర్తల గీతాన్ని ఆలపిస్తున్న మొవ్వ ప్రాజెక్టు సీడీపీవో సుధారాణి

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ టీచర్స్‌కు పోషన్ బీ పడాయి– భీపై జరిగిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో శేషుకుమారి మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల పిల్లల విద్యపై అవగాహన కల్పించినట్లు వివరించారు. సూపర్‌వైజర్ వి రత్నమాల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఐదు కాంప్లెక్స్‌ల పరిధిలోకి పాఠశాలలు

పెడన: మండలంలోని అన్ని పాఠశాలలు ఐదు కాంప్లెక్స్‌ల పరిధిలోకి తీసుకురావడం జరిగిందని ఎంఈవో–2 వైవీ హరనాథ్ తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలో శనివారం ఆయన కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరు కాంప్లెక్స్‌లు ఉండేవని, తాజా ఉత్తర్వులను అనుసరించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నడుచుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి మూడో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఐదు గంటల వరకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు(పాఠశాలలోని ఉపాధ్యాయుల సముదాయాలు) నిర్వహించాలని చెప్పారు. పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల యొక్క వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఏ విధంగా అమలు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. సమావేశాల్లో ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్



పెడనలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ గోపాలరావు తదితరులు



బీఎస్‌ఆర్ కాలనీలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

పెడన: పట్టణంలోని పలు చోట్ల శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కమిషనర్ గోపాలరావు రైతు బజారు, వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు పలు వార్డుల్లో తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇంచార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ రామారావు అవగాహన కల్పించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో–2 వైవీ హరనాథ్ పరిసరాల పరిశుభ్రతపై దిశానిర్దేశం చేశారు.

చల్లపల్లి: చల్లపల్లి పడమర వీధిలోని చల్లపల్లి వీవర్స్ సొసైటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం చల్లపల్లి, కొత్తమాజేరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు తడి, పొడి చెత్తపై జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి ఆర్‌సీ ఆనంద్‌కుమార్ అవగాహన కల్పించారు. వాటిని ఎలా వేరు చేయాలో ప్రత్యక్షంగా చూపించి వివరించారు. ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్ర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌ను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పలు సమావేశాల్లో ఎంపీడీవో సుబ్బారావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఘంటసాలపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎంఈవో 2 ఎండీ మోమిన్, ఐసీడీఎస్ ఘంటసాల, శ్రీకాకుళం సెక్టార్ల సూపర్ వైజర్లు టి.రమానాగమణి తదితరులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. రిజిస్ట్రార్ శోభన్ కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛదివస్‌లో భాగంగా శనివారం బంటుమిల్లి పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు తడి చెత్త–పొడి చెత్త ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కె. శైలజకుమారి, కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కాలనీవాసులు, పారిశుద్ధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులతో కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తానని, స్వచ్ఛతా కార్యక్రమాల నిర్వహణకు శ్రమదానం చేసి స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపై మళ్లీ కక్ష సాధింపు



బలరామునిపేటలో జేసీబీతో తొలగించిన గృహాలు

- బలరామునిపేటలో ఇళ్లు కూల్చివేత
- భారీగా పోలీసు పహారా

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కూటమి పాలకులు పేదలపై కక్షసాధింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. శనివారం నగరంలోని బలరామునిపేట రాజీవ్‌నగర్‌లో పేద ఎస్సీల గృహాల కూల్చివేతకు తెరలేపారు. ఆ ప్రాంతంలోని పాలకుర్తి లేఅవుట్ సరిహద్దులో ఉన్న ప్రైవేటు స్థలంలో దాదాపు 30 ఏళ్లుగా 20నివాసాలను ఏర్పరచుకుని జీవిస్తున్న పేదలు వైఎస్సార్ సీపీకి ఓట్లేశారనే కక్షతో కూటమి పెద్దలు రోడ్డు నిర్మాణానికి ఈ గృహాలు అడ్డువస్తున్నాయనే సాకును చూపి కూల్చివేతకు పాల్పడ్డారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ పోలీస్ ఫోర్స్‌తో జేసీబీలతో గృహాలను తొలగించేందుకు వచ్చారు. రెండు గృహాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు.

బాధితులకు అండగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్

విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. పాలకులు, వెంచర్ నిర్వాహకులను సంతృప్తి పరిచేందుకు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారా అని కమిషనర్ బాపిరాజును ప్రశ్నించారు. కూటమి పాలకులు ఎస్సీల జోలికి వస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. బాధితులకు 15 రోజులు అవకాశం ఇవ్వాలని విక్టర్‌ప్రసాద్ కమిషనర్‌ను కోరడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విక్టర్‌ప్రసాద్‌తోపాటు నగర మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు చీలి చక్రపాణి ఉన్నారు.

నోటీసులు కూడా ఇవ్వలేదు



ఇక్కడ దాదాపు 30 ఏళ్లుగా గృహాలు నిర్మించుకుని జీవిస్తున్నాం. మాకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది జేసీబీతో వచ్చి మా ఇంటిని కూల్చివేశారు. ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నాం. అధికారులు మాలాంటి పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకూ సబబు.

– జి. రోజామణి, బాధితురాలు

మాపై కక్ష సాధింపు దేనికి



మేము ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని మారుమూల ప్రాంతంలోని ప్రైవేటు స్థలంలో ఇంటిని నిర్మించుకుని జీవిస్తున్నాం. రెక్కాడితేకాని డొక్కాడని పేదలం. మాపై కక్షసాధింపులకు పాల్పడటం అన్యాయం. ఈ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి చేయమని మేం అడగలేదు. రోడ్డు అభివృద్ధికి మా గృహాలు అడ్డురావు.

– పి కోమలి, బాధితురాలు

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ర్యాలీ

పెడన: రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి 216 జాతీయ రహదారి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రోడ్డుపై ప్రయాణించే వాహనదారులను ఆపి వారికి రోడ్డు భద్రత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డి. బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, ఎస్ఐ జి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు కలెక్టర్ సత్కారం

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛ మచిలీపట్నం ఛాంపియన్స్‌గా ఎంపికైన గొడుగుపేటకు చెందిన సౌభాగ్యవతి, మల్కాపట్నంకు చెందిన నందినిలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శనివారం సత్కరించారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం వినూత్న కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఇంటిలోని చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చి పండ్లు, కూరగాయలు, పూల మొక్కలను పెంచుతూ ఇరువురు మహిళలు పర్యావరణ పరిరక్షణకు సహకారం అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో బందరు ఆర్డీఓ కే స్వాతి, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

చల్లపల్లి: మండలంలోని పాగోలు గ్రామంలో ఉన్న కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిర ప్రాంగణంలో సోమవారం నుంచి వారం రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జైపూర్‌లో ప్రత్యేకంగా చేయించిన శ్రీచక్రం ఆకారంలో ఉండే కమలాత్మికా సహిత అచలేశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అలాగే గర్భాలయంలో దత్తాత్రేయస్వామి, వ్యాస మహర్షి, ఆదిశంకరాచార్యులు, శ్రీలక్ష్మీదేవి, శ్రీకృష్ణుడి విగ్రహాలు, ఆలయం వెలుపల పంచముఖ ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సాక్షి గణపతి దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నట్లు ట్రస్టీలు మేకా సత్యనారాయణ ప్రసాద్(బంగారు బాబు), చాపరాల గాంధీప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రామాలయ పునఃప్రతిష్ఠ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట చెక్కలమేడ వీధిలో 110 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకోదండ రామాలయాన్ని పునఃనిర్మించి శనివారం ఉదయం 10.28 గంటలకు పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో శ్రీ సీత, శ్రీ కోదండ రామచంద్రమూర్తి, శ్రీ లక్ష్మణస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ వేదపండిత బృందం పూజలు, హోమాలు, ప్రతిష్ఠాపన ఘట్టాలను నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ, భక్త బృంద సభ్యులు పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న శ్రీఅయ్యప్ప ఆలయంలో శనివారం స్వామికి ప్రీతికరమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా నవవిధ ద్రవ్యాలతో మహాభిషేకాలు చేశారు. అనంతరం సహస్ర నామార్చన, పంచహారతి సేవ, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.